విలేఖరులు కావలెను
ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..
స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :94 నల్గొండ | శనివారం 28-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ | పేజీలు : 4 | వెల : రూ.1/-

## అత్యంత ప్రమాదకరంలో మంజీరా బ్యారేజీ : కేటీఆర్



హైదరాబాద్ : కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో నిన్న జూరాల ప్రాజెక్టును డేంజర్‌లోకి నెట్టిన సంఘటనకు 24 గంటలు గడవకముందే హైదరాబాద్ జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీని కూడా ప్రమాదంలో పడేయడం అత్యంత ఆందోళనకరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు, నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం క్షమించరాని నేరం. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు రావడం, ఆప్రాన్ కొట్టుకుపోవడం, స్పెల్ వేలోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎస్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయకపోవడం, నేడు ఎస్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టకపోవడం.. ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనం అని నిప్పులు చెరిగారు కేటీఆర్. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందని కేటీఆర్ అన్నారు. బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై బురదజల్లాయి. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్‌కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్-బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు, బ్యారేజీల్లో స్వల్ప రిపేర్లు వస్తే, అప్పటికప్పుడు వాటిని మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారే తప్ప కాళేశ్వరంపై కక్షగట్టినట్టు ఏ ప్రభుత్వాలు గతంలో వ్యవహరించలేదు. పరిపాలన చేతకాక కేవలం రాజకీయ కక్షసాధింపులతో కాలం వెల్లదీస్తున్న ఈ ముఖ్యమంత్రి మంజీరా, మేడిగడ్డ వంటి తాగు సాగునీటి బ్యారేజీలను రిపేర్లు చేయకుండా వదిలేస్తే, సీఎం రేవంత్‌ను, కాంగ్రెస్ సర్కారును చరిత్ర ఎప్పటికీ క్షమించదు అని కేటీఆర్ హెచ్చరించారు. చివరకు జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.

## నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు!.. మంత్రి జూపల్లి

ఆదిలాబాద్, కేసీఆర్ ప్రభుత్వంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్ జరిగిందని, తల తిక్క పనులతోనే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించారని, అందుకే కుప్పకూలిపోయిందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ లు చేయడం ఆదర్శ పాలన ఎట్లా అవుతుందనీ ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ఇతర అంశాల్లో కూడా కేసీఆర్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు.

రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తాం..

ఎన్నికలు ఏవైనా కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలను కైవసం చేసుకుంటుందనే పూర్తి విశ్వాసం ఉందనీ మంత్రి జూపల్లి అన్నారు. పరిపాలన ద్వారా ఉమ్మడి జిల్లాలో కచ్చితంగా మార్పులు తెస్తామన్నారు. నాయకుల మధ్య విభేదాలు ఉంటే.. వాటిని తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. అందరం కలిసి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు.

తెలంగాణకు బీజేపీ చేసేందేమీ లేదు

తెలంగాణకు బీజేపీ చేసిందేమి లేదని మంత్రి అన్నారు. ఆనాడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడు రాష్ట్రాలను ఇచ్చి రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదని, ఈనాడు కూడా నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేస్తుందన్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయిస్తూ.. తెలంగాణకు మొండి చేయి చూపుతున్నారని, తెలంగాణలోని ఏ ప్రాజెక్టుకు కూడా జాతీయ హెూదా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరుగుతుందని తెలిసి, తెలంగాణ బిడ్డల ప్రాణ త్యాగాలను చూసి మానవీయ కోణంలో సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కొట్లాడి సాధించుకున్న తెలంగాణను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మండిపడ్డారు. అవినీతి, నిర్బంధ, కుటుంబ, అప్రజాస్వామిక పాలనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రం అప్పులకుప్పగా మారిందన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా



గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి%ా% ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారు.

ఆదిలాబాద్ రిమ్స్ అధ్వానం

ఆదిలాబాద్ లోని రాజీవ్ గాంధీ మెడికల్ కళాశాల లో అపరిశుభ్రతతో రోగులు ఇక్కట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిమ్స్ ఆస్పత్రిని సందర్శించి ఐసీయూ, బ్లడ్ బ్యాంక్, జనరల్ అవుట్ పేషెంట్స్ విభాగాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో అడుగడుగునా అపరిశుభ్రత నెలకొనడం చూసి మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రిమ్స్ పారిశుద్ధ్య కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని డీన్ ను ఆదేశించారు. మంత్రి జూపల్లి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ని సందర్శించి రోగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు.

యాంటీ డ్రగ్స్ పై పోలీసుల 5 కె రన్

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన 5కె రన్ కు విశేష స్పందన లభించింది. డ్రగ్స్ పై ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా యుద్ధం చేయాలని మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి నిర్వహించిన భారీ పరుగు ర్యాలీలో మంత్రి జూపల్లి, ఎంపీ నగేష్, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎస్పీ కాజల్ సింగ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వేడమ బొజ్జు, ఎమ్మెల్సీ దండే విట్టల్, రిమ్స్ మెడికోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మునుగోడు ఎన్నికల సమయంలో నా ఫోన్ ట్యాపింగ్

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీజేపీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇవాళ(శుక్రవారం) జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో సిట్ అధికారులకు తన వాంగ్మూలం ఇచ్చారు. ఈ క్రమంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్టేట్‌మెంట్‌ని సిట్ అధికారులు రికార్డ్ చేశారు. 2023 నవంబర్‌లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు.

ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. మునుగోడు, దుబ్బాక, హుజురాబాద్ ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లుగా సిట్ అధికారులు చూపించారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చానని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి. మునుగోడు, దుబ్బాక ఎన్నికల సందర్భంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. చట్టవిరుద్ధంగా తన ఫోన్ ట్యాపింగ్ చేశారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకు వ్యతిరేకత వచ్చిందని.. దాంతో అభద్రత భావంతో తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని అన్నారు. తన ఆఫీస్‌లో వారెంట్ లేకుండా వచ్చి కొందరు పోలీస్ అధికారులు దౌర్జన్యం చేసి.. ఫోన్ ట్యాపింగ్ చేశారని వెల్లడించారు. గత డీజీపీ మహేందర్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేయించారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో తనతో పాటు తన అనుచరుల మూవ్‌మెంట్‌ని కూడా పసిగట్టారని చెప్పారు. తన స్నేహితుడు బంగారం కొన్న రూ.72 కోట్లను పోలీసులు పట్టుకున్నారని.. అవి తన డబ్బులు అన్నట్లుగా ఫోన్ ట్యాపింగ్ చేసి బెదిరించారని తెలిపారు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి. తన భూమి అమ్మితే కొన్న వ్యక్తి పైసలు ఇచ్చారని.. అతన్ని కూడా హింసించి రూ.13 కోట్ల ఎలక్టోరల్ బాండ్స్ రాయించారని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. ఈటల రాజేందర్‌కి డబ్బులు ఇచ్చినట్లుగా



కేసీఆర్ ప్రభుత్వంలో తనపై నిందలు మోపారని విమర్శించారు. తాను ఈటలకు ఎన్నికల సమయంలో సపోర్ట్ చేశానని.. కానీ డబ్బులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. తన మొబైల్ రికార్డింగ్ ట్యాపింగ్ కాకపోవడంతో లైవ్ ట్యాపింగ్ చేశారని చెప్పుకొచ్చారు. తనతో పాటు తన భార్య సంగీత ఫోన్‌ని సైతం ట్యాపింగ్ చేశారని మండిపడ్డారు. మునుగోడు ఎన్నికల సమయంలో తాము ఇన్‌చార్జ్‌లుగా ఉన్నపుడు తమ ఫోన్లు ట్యాపింగ్ చేశారని గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు హెూం సెక్రటరీ అనుమతి ఉండాలి కానీ ఇక్కడ అవేమి లేకుండా ట్యాపింగ్ చేశారని ఫైర్ అయ్యారు. తన కాల్స్‌ని చట్టవిరుద్ధంగా రికార్డ్ చేశారని చెప్పారు. తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తే తిరిగి తనపైనే నాన్ బెయిలబుల్ కేసు పెట్టి ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభాకర్‌రావుతో పాటు ఈ ట్యాపింగ్‌లో ఇన్వాల్ అయిన వారిని కఠినంగా శిక్షించాలని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై పార్లమెంట్‌లో మాట్లాడుతామని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

## అమెరికా దాడుల ఎఫెక్ట్.. ట్రంప్‌కు షాకిచ్చిన ఇరాన్



టెహ్రాన్: అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడికి ఇరాన్ ఊహించిన షాకిచ్చింది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం సందర్భంగా తమపై అమెరికా దాడుల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. అమెరికాతో ఎలాంటి అణుచర్చలు జరిపే ఉద్దేశం తమకు లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల మాట్లాడుతూ వచ్చేవారం ఇరాన్‌తో అణుచర్చలు జరగనున్నాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందించారు. ఈ సందర్భంగా అబ్బాస్.. అమెరికాతో అణు ఒప్పందానికి సంబంధించి సమావేశమయ్యే ఆలోచన మాకు లేదు. ఇటీవల ఇరాన్‌పై అమెరికా చేసిన దాడులు గణనీయమైన నష్టాన్ని కలిగించాయి. ఇరాన్ అణు కార్యక్రమం పునరుద్ధరణపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఇలాంటి తరుణంలో అమెరికాతో చర్చల్లో పాల్గొనే ఆలోచనే లేదు అని కుండబద్దలు కొట్టారు. మరోవైపు.. నాటో శిఖరాగ్ర సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ.. వచ్చేవారం టెహ్రాన్‌తో అణుచర్చలు జరుపుతామన్నారు. అణ్వాయుధాలు తయారుచేయాలన్న ఆశయాన్ని వదిలేసేలా ఇరాన్‌తో ఒప్పందం చేసుకొనే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో ఇరాన్ చమురుపై ఆంక్షల విషయంలో కూడా చర్చించేందుకు తాము సిద్దంగా ఉన్నట్టు ట్రంప్ హింట్ ఇచ్చారు. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్‌పై యుద్ధంలో ఇరాన్ విజయం సాధించిందని, అమెరికా జోక్యం చేసుకోకుండా ఉంటే ఆ దేశం నాశనమయ్యేదని ఇరాన్ సుప్రీంనేత అయతుల్లా అలీ ఖమేనీ పేర్కొన్నారు. ఖతార్‌లోని అమెరికా స్థావరంపై దాడి చేసి అగ్రరాజ్యాన్నీ చాచి చెంపదెబ్బ కొట్టామని అన్నారు. మళ్లీ తమపై దాడి చేసే ప్రయత్నం చేస్తే అమెరికా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై బంకర్ బ్లస్టర్ బాంబులు, క్రూజ్ క్షిపణులతో అమెరికా చేసిన దాడులు విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఈ దాడుల్లో అగ్రరాజ్యం ఏమీ సాధించలేకపోయిందని అన్నారు. ఖతార్‌లో అమెరికా స్థావరంపై తాము చేసిన దాడికి చాలా ప్రాధాన్యం ఉందని చెప్పారు. అమెరికా స్థావరాలకు చేరగల సత్తా తమ దేశానికి ఉందని నిరూపితమైందని అన్నారు. భవిష్యత్తులోనూ అవసరమైన సందర్భాల్లో ఇలాంటి దాడులు చేస్తామని అమెరికాను ఖమేనీ హెచ్చరించారు.

### ఖమేనీని అంతమొందించాలని అనుకున్నాం

టెల్‌అవీవ్, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ముగిసింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణతో 12 రోజులుగా సాగిన యుద్దానికి తెపడింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. అయితే, ఈ యుద్ధంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అంతమొందించాలనుకున్నట్లు ఇజ్రాయెల్ తాజాగా ప్రకటించింది. అయన కోసం తీవ్రంగా గాలించినట్లు తెలిపింది. అయితే, ఖమేనీ అత్యంత సురక్షితమైన బంగర్‌లోకి వెళ్లిపోవడంతో ఆ ప్రయత్నం విఫలమైనట్లు ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ తాజాగా తెలిపారు. ఓ పబ్లిక్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కాట్జ్ మాట్లాడుతూ.. 'ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని అంతం చేయాలనుకున్నాం. ఇందుకోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశాం.

## మార్పు అంటే ఇదేనా..? అన్నపూర్ణ క్యాంటీన్‌ల పేరు మార్పుపై బండి సంజయ్ ఫైర్



హైదరాబాద్, జూన్ 27 : రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో అన్నపూర్ణ క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ' ఎక్స్' వేదికగా ఫైర్ అయ్యారు. తెలంగాణలో మార్పు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ 18 నెలల్లో కేవలం పేర్లను మాత్రమే మార్చిందని ఎద్దేవా చేశారు. విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, అవార్డుల పేర్లు, నీటిపారుదల ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్ల పేర్లు, గృహ నిర్మాణ పథకం, వ్యవసాయ రుణ ప్రోత్సాహకాలు, హరితహారం, అధికారిక నివాసం, తెలంగాణ తల్లి విగ్రహాలను మార్చారని మండిపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు సిగ్గు లేకుండా దేవతామూర్తి అయిన అన్నపూర్ణ పేరును తొలగించి ఇందిరా క్యాంటీన్ అని పేరు మార్చడం హిందూ విశ్వాసాలను అవమానించడమే అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## బేసిన్‌కు బాసిన్‌కు తేడా తెలియని సీఎం రేవంత్..

హైదరాబాద్, జూన్ 27: బనకచర్లపై పీపీటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో మాజీ మంత్రి మాట్లాడుతూ.. డైవర్షన్ కోసమే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారని మండిపడ్డారు. 2016 ఎజెండా మినిట్స్‌పై రేవంత్ రెడ్డితో చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇరు రాష్ట్రాలు కూర్చుని ప్రణాళికలు సిద్ధం చేసుకుందామని మాత్రమే కేసీఆర్ అన్నారని.. తెలంగాణకు ఆమోదయోగ్యం లేకుంటే ఒప్పుకునేది లేదని 2016 మీటింగ్‌లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. బనకచర్లపై కేంద్ర జలశక్తి మీటింగ్‌లో ప్రభుత్వం తెలంగాణ వాదనను గట్టిగా వినిపించాలని డిమాండ్ చేశారు.



## ఆదివాసీల సంక్షేమంలో రాజీలేదు...

ములుగు,జూన్27: ఆదివాసీల ప ట్ల తన చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు. తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై శుక్రవారం ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని



స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపె÷-టటెందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

## గద్వాల తరహాలో మరో ఇల్లాలు ఘాతుకం

అనంతపురం,తెలంగాణలోని గద్వాలలో ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసును మరిచిపోకముందే.. ఏపీలో మరో ఘోరం చోటుచేసుకుంది. సరిగ్గా అలాంటి ఘటనే చోటుచేసుకుంది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య భర్తను చంపించింది. ప్రియుడి సాయంతో భర్తను అడ్డుతొలగించే క్రమంలో భర్తను హత్య చేయించింది. ఈ దారుణ ఘటన అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి–రాచానపల్లి రోడ్డులో చోటుచేసుకుంది. అక్కంపల్లిలో చిన్న హోటల్ నిర్వహిస్తున్న సురేష్‌బాబు(43) అనే వ్యక్తి హత్య ఘటన వెలుగులోకి వచ్చిన కేవలం ఆరు గంటల్లోనే పోలీసులు ఈ కేసును ఛేదించారు. భార్యే అసలు సూత్రధారి అని గుర్తించారు. ఈ కేసులో సురేష్ భార్య అనిత (37), ఆమె ప్రియుడు ఫక్రుద్దీన్(34)ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుపై పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..'సురేష్‌బాబు స్థానిక కల్యాణదుర్గం రోడ్డులో ఓ చిన్న హోటల్ నడుపుతున్నాడు. అతడి భార్య అనిత తొలుత ఓ హోటల్‌లో పనిచేసేది. ఈమెకు రెండు నెలల కిందటే బాబా ఫక్రుద్దీన్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతడు పదేళ్ల కిందట స్వగ్రామమైన గొరదిండ్ల నుంచి స్థానిక సదాశివకాలనీకి కుటుంబం సహా మకాం మార్చాడు. అతడు ఊరూరా తిరుగుతూ పండ్లు విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలోనే అనిత, బాబా ఫక్రుద్దీన్‌ల మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. భర్త సురేష్‌బాబుకు అనుమానం రావడంతో భార్యను తాగొచ్చి వేధించేవాడు. తనను అనుమానిస్తుండటం, అదే సాకుతో వేధిస్తుండటం వంటి విషయాలన్నీ అనిత తన ప్రియుడు ఫక్రుద్దీన్‌కు చెప్పింది. తమ వివాహేతర సంబంధానికి అడ్డుతగులుతున్న భర్తను ఎలాగైనా చంపితే ఇద్దరం సంతోషంగా ఉండొచ్చని ప్రియుడిని ఉసిగొల్పింది. ప్రతిరోజు రాత్రి హోటల్ మూసేసి తన భర్త టూవీలర్‌పై ఇంటికొస్తాడని, ఆ సమయంలో చంపితే సరిపోతుందని కుట్ర పన్నింది. ఇందుకు సరేనని అంగీకరించిన బాబా ఫక్రుద్దీన్.. వ్యాపారం నిమిత్తం మార్తాడు గ్రామానికి వెళ్లాడు. ఆ సమయంలో అతడికి ఫోన్ చేసిన అనిత.. ఎలాగైనా తన భర్తను ఈరోజు చంపాలని సూచించింది. దీంతో హోటల్ మూసేసి.. రాత్రి 11 గంటల సమయంలో సదాశివ కాలనీకి బైక్‌పై బయల్దేరిన సురేష్‌బాబుపై మార్గ మధ్యలో బాబా ఫక్రుద్దీన్ దాడి చేశాడు. అక్కడే అందుబాటులో ఉన్న సీసాను సురేష్‌బాబుపై విసిరాడు. దీంతో ద్విచక్రవాహనం సహా కిందకు పడిన అతడిపై ఫక్రుద్దీన్ దాడి చేశాడు. తన వెంట తీసుకెళ్లిన స్క్రూడ్రైవర్‌తో పొడిచి ఆ తర్వాత బండరాయితో బాది హత్య చేసిన తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. అక్కంపల్లి సమీపంలో హత్య జరిగిందనే విషయం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ పి.జగదీశ్ రంగంలోకి దిగారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సీఐ శేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. నిందితుల కోసం గాలించి.. పక్కా సమాచారంతో కేవలం ఆరు గంటల్లోనే వారిని అరెస్టు చేశారు. ఈ కేసు ఛేదించిన పోలీసుల బృందాన్ని ఎస్పీ అభినందించారు.

## ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు

విజయవాడ,ఇంద్రకీలాద్రిపై ఆషాఢ సారె మహోత్సవం కొనసాగుతోంది. స్వర్ణాభరణాలతో పసిడికాంతులు వెదజల్లే కనకదుర్గమ్మను ఆడపడుచుగా భావించి భక్తులు సారెను తీసుకొస్తున్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆషాఢ మాసం సందర్భంగా..గురువారం నుంచి జులై 24 వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శీనానాయక్ దంపతులు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి నకదుర్గమ్మ ఆలయం లో గురువారం నుంచి నెల రోజులపాటు వారాహి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఈవో శీనానాయక్ దంపతులు తొలి సారెను సమర్పించారు. మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారే సమర్పించారు. పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చలిమిడి, గోరింటాకు అమ్మవారికి శేష వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తమ చేతుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని తమ పుట్టింటికి రమ్మని వేడుకుంటూ సారె సమర్పించామన్నారు. ఆషాఢ మాసంలో నెల రోజులపాటు అంగరంగ వైభవంగా సారే సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ నుంచి అమ్మవారికి ఈనెల 29వ తేదీన బంగారు బోనం సమర్పిస్తారని చెప్పుకొచ్చారు. ఈ మాసంలోనే అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాలు జరుగుతాయన్నారు. జులై 8 , 9, 10 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈరోజు నుంచి నెల రోజులపాటు ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు జరుగుతాయని ఈవో శీనానాయక్ వెల్లడించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శనం అనంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు. కాగా, వైదిక కమిటీ సూచనల మేరకు హోమ గుండాలు, భక్తులు కూర్చునేందుకు తివాచీలు ఏర్పాటు తదితర అంశాలపై ఈవో శీనా నాయక్ ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశారు. వారాహి అమ్మవారి నవరాత్రుల గురించి ప్రచారం చేసి విజయవంతం చేయాలని పలు విభాగాలకు ఆదేశాలిచ్చారు. వారాహి ఉత్సవాలు జులై 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

## మరోమూడేళ్లు సీఎం రేవంత్ రెడ్డే

హైదరాబాద్,మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు.

# ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఎవరంటే?




ఖమ్మం,ఆ జిల్లా డీసీసీ పీఠంకోసం పలువురు ఆశావాహులు ఆశగా ఎదురు చూస్తున్నారట ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్న నాయకుడు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి కావాలని పట్టుపడుతున్నాడని పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఇక ఓ మంత్రి అనుచరులు ఇద్దరు తమకు డీసీసీ పదవి ఇప్పించాలని ఆయన్ను కోరుతు న్నారట. మరో పక్క మాజీ కేంద్ర మంత్రి,రాజ్యసభ సభ్యురాలు కూడా తమ వర్గం వారికే ఇవ్వాలని పట్టుబడుతున్నారట. ఇంతలా ఆ పదవి కోసం పోటీప డుతున్న జిల్లా ఏది? ఎవరా నేతలు?

కాంగ్రెస్‌కు కంచుకోటగా ఖమ్మం జిల్లా

ఖమ్మం జిలకాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి గట్టిపట్టున్న ప్రాంతమని కాంగ్రెస్ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. స్వరాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అంతకు ముందు కూడా కాంగ్రెస్ కంచుకోటగా ఖమ్మం జిల్లాకు నిలిచింది. గతంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్ళు పాటు అధికారంలో ఉన్నా%ొ% ఇక్కడ ప్రతి సారీ ఒక్క ఎమ్మెల్యేతోనే సరిపెట్టుకుంది. గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ చేర్చుకున్నా, పార్టీ క్యాడర్ పెద్దగా చెక్కు చెదరలేదనే చర్చ ఉంది. అందుకే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లాలోని ఐదు స్థానాల్లో ఐదుకు ఐదు.. భారీ మెజారిటీతో గెలుపొందడం వెనక పార్టీ నేతలు, కార్యకర్తల కృషి అమోఘమని చెప్పవచ్చు.

పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలిచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గడిచిన పదేళ్ళుగా కాంగ్రెస్ పార్టీకీ అధికారం లేక అచేతనంలో ఉన్న కాలంలో ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పార్టీ క్యాడర్‌కు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చారు. పార్టీ అభివృద్ధి కోసం శ్రమించారు. ఆయన ప్రధాన అనుచరుడిగా ఉన్న పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ సైతం పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు డీసీసీ పదవి సమర్థవంతంగా చేపట్టి గ్రామాల్లో కిందిస్థాయి కార్యకర్తలకు మనోధైర్యాన్ని నింపడంలో సఫలమయ్యారు. నిత్యం భట్టి సూచనలతో పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పార్టీ కార్యాలయం వేదికగా ఆనాటి ప్రభుత్వ పనితీరును ఎండగట్టేవారు. బీఆర్ఎస్ పార్టీ నేతలు కాంగ్రెస్ పార్టీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఆర్థికంగాను, మానసికంగాను ఇబ్బందులకు గురిచేసినా.. వాటన్నింటిని తట్టుకొని ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా కింది స్థాయి కేడర్‌ను పటిష్టం చేసే ఉండేవారు. భట్టి సూచనలతో జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ వ్యూహాలు ఫలించాయట.. ఫలితంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8 సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందంటారు.

రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తనకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి, లేదా ఖమ్మం సూడా ఛైర్మన్ పదవిలో ఏదో ఒకటి ఇవ్వాలని భట్టి విక్రమార్కను గట్టిగానే కోరుతున్నారట ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్. అయితే ప్రస్తుత పరిస్థితిలో ఆ రెండు పదవులు ఇచ్చే పరిస్థితి లేదని డిప్యూటీ సీఎం భట్టి పువ్వాళ్ళను సముదాస్తూ వస్తున్నారని టాక్. ఇటీవల ఏఐసిసి అగ్రనేత రాహుల్ గాంధీ జిల్లాల్లో పార్టీ అధ్యక్షులే కిరోల్ అని చెప్పడంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు గా ఉన్న దుర్గాప్రసాద్ నే కొనసాగాలని కోరుతున్నారట.సముచిత స్థానం ఇప్పించాలని కోరుతున్న పొంగులేటి ఇద్దరు అనుచరులుఇక ఇదిలా ఉంటే జిల్లాకు చెందిన మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరులు ఇద్దరు తమకు సముచిత స్థానం ఉండె పోస్టు ఇప్పించాలని కోరుతున్నారట. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆయనను డిమాండ్ చేస్తున్నారట. వారిలో ఒకరు వైరా నియోజకవర్గానికి చెందిన బీసీ సామాజికవర్గ నేత, మరొకరు ఎస్సీ కేటగిరికి చెందిన వ్యక్తిగా ఉన్నారని సమాచారం. వీరిద్దరూ మంత్రి పొంగులేటికి ప్రధాన అనుచరులు కావడం విశేషం. ఆ ఇద్దరు నేతలు జిల్లాలో బలమైన నేతలుగా ముద్ర పడినవారే కావటంతో.. వారు కూడా జిల్లా డీసీసీ పదవి ఇప్పించాలని మంత్రిని కోరుతున్నారట.న అనుచరులకు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు రేణుక చౌదరి వ్యూహాలు వీరే కాక ఖమ్మం ఆడబిడ్డగా చెప్పుకునే ఫైర్ బ్రాండ్, మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి కూడా తన అనుచరులకు జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టేందుకు పావులు కదుపుతున్నారట. పాలేరు నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెడ్పీటీసీగా గెలిచి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న%ొ% జడ్పీటిసి రాష్ట్ర సంఘం మాజీ అధ్యకులు కూడా తనకు సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నారట. అంతేకాదు మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కూడా తనకు పార్టీలో సముచిత స్థానం కావాలని పార్టీ పెద్దలను కోరుతున్నారట వీరికి గ్రామీణ ప్రాంతాల్లో, మండలాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహనతో పాటు కార్యకర్తలతో మంచి ఫాలోయింగ్ ఉందనే చర్చ ఉంది. అంతేకాదు గత పాలకుల పనితీరును ఎండగట్టే సందర్భాలలో గలమెత్తి నినదించారనే టాక్ లేకపోలేదు. అందుకే డీసీసీ పదవి ఇవ్వాలని ఆశిస్తున్నారు ఈ నేతలు.

ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్ష పీఠంపై భారీగానే నేతల ఆశలు

ఇలా పలువురు నేతలు ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్ష పీఠంపై భారీగానే ఆశలు పెట్టుకున్నారు. తమకు మంత్రులతో ఉన్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించకోని ఖమ్మం జిల్లా పార్టీ, అధ్యక్ష పదవి కోసం ఎవరికి వారే గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారట. ఇలా ఎవరి ఆశలు వారికి ఉన్నాయి. తమ అనుచరులకే పగ్గాలు ఇప్పించాలని అటు మంత్రులు, పార్టీ పెద్దలు పావులు కదుపుతున్నారు. మరి పార్టీ అధిష్టానం ఎవరిని డిసిసి అధ్యక్షునిగా ఎంపిక చేస్తుందనేది ఇప్పుడు ఇంట్రెస్టింగ్‌గా మారింది. అదే సమయంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయంతో ఎవరి మనసు నొచ్చుకొకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

## నగరంలో ఆషాడ బోనాల సందడి

హైదరాబాద్,ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది.

## విభజన చట్టం మేరకు పెరగని అసెంబ్లీ సీట్లు

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి. ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. దీనిపైనా చంద్రబాబు ఒత్తిడి చేసే అవకాశం లేకపోలేదు. అయితే జనాభా గణన జరిగే వరకు వేచి చూస్తారని అంటున్నారు. జనభా లెక్కలు తేలాక ఎలాంటూ డీ లిమిటేషన్ జరగవచ్చని అంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతు న్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి. ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి. జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన పక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్యానంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ పక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు. ఇప్పుడు జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# గద్దర్ అవార్డుల్లో ఏదీ పారదర్శకత?

హైదరాబాద్,ఇటీవల జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్' కార్యక్రమం ఒక విషయం స్పష్టంగా చూపింది. గద్దర్ పేరుతో అన్నీ విభాగాల అవార్డులకూ పేర్లు పెట్టడం ఘోరమైన పొరపాటు. గద్దర్ విప్లవాత్మక ఆలోచనలకు విరుద్ధమైన చిత్రాలకు అవార్డులు ఇస్తే, అది గద్దర్ వారసత్వాన్ని అవమానించడమే కాక, ఆయనను స్మరించడంలో ఉండే సారాన్ని మసకబార్చేపనిగా మారుతుంది. పలుమార్లు హెచ్చరికలివ్వబడినప్పటికీ ప్రజాభిప్రాయాన్ని తృణప్రాయంగా పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు పోయింది. జ్యూరీ ఎంపికనుండి అవార్డుల నిర్ణయాల వరకూ ఈ కార్యక్రమమంతా తెలంగాణ ప్రజలను తీవ్రంగా నిరాశపరిచింది. ఈ ప్రక్రియ అంతా పారదర్శకతలేకుండా, అనేక విరుద్ధతలతో నిండినదిగా ఉంది. దీనిని సమీక్షించకుండా వదిలేస్తే, ఇది రాష్ట్ర సాంస్కృతిక రంగంలో శాశ్వత మచ్చగా మిగిలిపోతుంది.అంతేకాదు, ఇది బాధ్యత వహించేవారి సామర్థ్యం, నైతికతలపై కూడా తీవ్రమైన సందేహాలు కలిగిస్తోంది. ఉదాహరణకు, పుష్ప 2 చిత్రంలోని స్మగ్లర్ పాత్రకు అవార్డు ఇచ్చారు. ఈ సినిమాలో అసభ్యతలు, పోలీసుల్ని దూషించే ఘట్టాలు ఉన్నాయి. దీనిద్వారా మన యువతకు ఏ సందేశం ఇస్తున్నాం? ఏ విలువలు మిగులుస్తున్నాం? ఇది అక్రమతను, అసభ్యతను, చట్టవ్యతిరేకతను ప్రోత్సహించడమే కదా? ఇది గద్దర్ పేరుతో జరగాల్సిన కార్యక్రమమా? ఇంకో తీవ్రమైన విషయమేమిటంటే – రజాకార్ అనే సినిమాకు రాష్ట్ర అవార్డు ఇవ్వడం. ఈ చిత్రం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించిందని, మత విద్వేషాలను ప్రేరేపించేలా ఉన్నదని చరిత్రకారులు, రచయితలు విమర్శించారు. అలాంటి సినిమాకి చారిత్రక చిత్రం విభాగంలో అవార్డు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం వక్రీకృత చరిత్రను సమర్థించినట్టైంది. ఇది గద్దర్ లాంటి విప్లవాత్మక నాయకుడి పేరుతో జరిగిందంటే, అది మరింత దురదృష్టకరం. తాము సెక్యులర్ విలువలకు కట్టుబడి ఉన్నామని చెప్పుకునే పార్టీకే ఇది చారిత్రక అపసవ్యంగా నిలుస్తుంది.అవార్డు కమిటీ సభ్యులలో ఒకరైన గేయ రచయిత 'షామ్' కూడా అదే సినిమాకు పనిచేయడం మరొక పెద్ద నైతిక ఉల్లంఘన. జ్యూరీగా పనిచేస్తూ, తనకు సంబంధించిన సినిమాకు పురస్కారం రావడం ద్వారా ఆ ప్రక్రియకు విశ్వసనీయతే మిగలదు. ఇంకో ఉదాహరణ అవార్డు కార్యక్రమానికి ఒకరోజు ముందు, తెలంగాణ మంత్రివర్గ సభ్యుని సోదరుడైన పొన్నం రవిచంద్రను ఉత్తమ విమర్శకుడిగా ప్రకటించడం. అసలు ఆ విభాగానికి ముందుగా ఏ దరఖాస్తులూ లేవని ప్రకటించారు. మరి ఒక రోజులోనే ఆయన పేరు ఎలా వచ్చింది? ఇది అవార్డు నిబంధనలకు, విధివిధానాలకు విరుద్ధమే కాక, అవార్డులు ఎలా యాదృచ్ఛికంగా నిశ్చయించబడుతున్నాయన్నదానికి ఉదాహరణ. అలాగే, ఉర్దూ సినిమాలకోసం సరైన జ్యూరీని ఏర్పాటు చేయలేదన్నది మరొక ప్రధాన సమస్య. గత పదేళ్లలో ఒక్క ఉర్దూ సినిమాకూ అవార్డు ప్రకటించలేదు ఎందుకు?. ఉర్దూ భాషా పరిజ్ఞానం లేని జ్యూరీతో ఎలా న్యాయం జరుగుతుంది?. ఇవన్నీ కాకుండా, అసలు అవార్డు ప్రక్రియనే అవగాహనారాహిత్యంగా మొదలయింది. పద్మ అవార్డులు, జాతీయ ఫిలిం అవార్డులు, అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్స్ అన్నీ స్పష్టమైన దరఖాస్తుల పద్ధతిలో, పారదర్శకంగా నిర్వహించబడతాయి.కానీ తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషను మాత్రం 2024లో సెన్సార్ అయిన చిత్రాలకే దరఖాస్తులు ఆహ్వానించింది. గత పదేళ్లలో(జూన్ 2, 2014 నుంచి డిసెంబర్ 31, 2023 వరకు) వచ్చిన సినిమాలకైతే దరఖాస్తే తీసుకోలేదు. అలాంటప్పుడు సెన్సార్ అయిన సినిమాలన్నీ చూసి నిర్ణయించవలసి ఉంటుంది. ఇంకో ఆందోళన కలిగించే విషయం 2014నుండి 2023 వరకు అవార్డులు కేవలం నిర్మాతలకే ఇవ్వబడ్డాయి. అసలు సినిమాలు చూసే పనే చేయలేదు. ఆ సినిమాల




కళాకారులు, సాంకేతిక నిపుణుల్ని పూర్తిగా పక్కనపెట్టారు. టిఎఫ్‌డిసి ఛైర్మన్ స్వయంగా నిర్మాత కావడం ఈ ప్రక్రియను మరింత అనుమానాస్పదంగా చేస్తుంది. ఇది అసలు కళను గౌరవించడం కాదు పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించే వ్యవస్థగా మారిపోయింది. ప్రజాధనం, కళా ప్రేరణకు వాడాలి కానీ, లోపాయికారి వర్గాలకు లబ్ధి చేకూర్చటానికి కాదు. ఇంకా, టిఎఫ్‌డిసి ఛైర్మన్‌కు సంబంధిత నాలుగు చిత్రాలు (శతమానం భవతి, మహర్షి, ఫిదా, బలగం) అవార్డులకు ఎంపికవడం, వాటిలో రెండింటిలో జ్యూరీ హెడ్ జయసుధ నటించడమూ తగిన విధాన ఉల్లంఘనలే. అసలు అధికారిక జ్యూరీ ఉన్నా, ఎందుకు మరో జ్యూరీ వేసారు? ఆ కొత్త జ్యూరీ సినిమాలు చూసిందా? నిబంధనల ప్రకారం టిఎఫ్‌డిసి అధికారులకు సంబంధిత సినిమాలను అవార్డుల పోటీలో అర్హత కలిగించకూడదు. ఇది నిబంధనల ఉల్లంఘనే!.ఇంకా చాలా మంచి సినిమాలు, ముఖ్యంగా తెలంగాణ సినిమాలు పూర్తిగా విస్మరించబడ్డాయి. 15 –20 రోజుల్లోనే అన్ని సినిమాలు చూడడం అసాధ్యం. ఇది పూర్వనిర్దేశిత పక్షపాతంతో కూడిన వ్యవస్థ అని చెప్పక తప్పదు. అలాగే షార్ట్ ఫిలిం విభాగానికి దరఖాస్తులు తీసుకున్నా, అవార్డులు ఎవరికి ఇచ్చారో వేడుకలో ప్రకటించలేదు. ఇది మరీ అన్యాయం! తొందరపడి, జనం మనసు గెలవాలనే ఉద్దేశంతో చేసిన ఈ వేడుక, ఖర్చులన్నీ ప్రజాధనంతో నిర్వహించినా, విశ్వసనీయతను కోల్పోయింది. ప్రజల ప్రశంసకన్నా వ్యతిరేకతే ఎక్కువగా ఎదుర్కొంది. మంచి మార్గం ఏమిటంటే మొదటగా తెలంగాణ ఫిలిం పాలసీని ఏర్పాటు చేయాలి. గద్దర్ ఆశయాలకు అనుగుణంగా ఉన్న చిత్రాలను ప్రోత్సహించాలి. అప్పుడు ఇచ్చే అవార్డులు నిజమైన గౌరవంగా నిలుస్తాయి. ప్రస్తుతంగా ఎంపిక చేసిన ఏ సినిమా గద్దర్ ఆలోచనలతో సంబంధం లేదు. మరి, ఈ విధంగా ఈ సినిమాల ఎంపికను ఎలా ఆయనకు నివాళిగా చెప్పగలం? కాబట్టి, ఈ వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని తిరిగి పొందడానికి, గద్దర్ గౌరవాన్ని కాపాడటానికి ఈ సూచనలు అమలు చేయాలి: 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబర్ 31 మధ్య విడుదలైన సినిమాల కోసం తక్షణమే టిఎఫ్‌డిసి దరఖాస్తులను ఆహ్వానించాలి. కొత్త, స్వతంత్ర జ్యూరీని సినీ దర్శకులు, రచయితలు, విమర్శకులు, సీనియర్ మేధావులతో నియమించాలి. ఆ దశాబ్దపు సినిమాలన్నీ, అలాగే 2024 దరఖాస్తు చేసిన సినిమాలు పారదర్శకంగా మళ్లీ కొత్త జ్యూరీ చూడాలి. చూసి, నాణ్యత, సాంస్కృతిక విలువల ఆధారంగా అవార్డులు ఇవ్వాలి. ఈ విమర్శను దాడిగా కాకుండా, రాష్ట్రం, తెలంగాణ కళాసంస్కృతి పట్ల మమకారంతో చెప్పిన విజ్ఞప్తిగా స్వీకరించాలి. నేను ఒక చిత్రదర్శకుడిగా, తెలంగాణ ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా, ఈ రాష్ట్ర కళావారసత్వం, ప్రతిష్ఠను నిలబెట్టాలనే ధ్యేయంతో సూచిస్తున్నాను.

## గెలుపు వారిదే ...

హైదరాబాద్,జూబ్లీహిల్స్ లో ఉప ఎన్నికకు ప్రధాన పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. సీఎం రేవంత్ సైతం పార్టీ సమావేశంలో బై పోల్ పైన దిశా నిర్దేశం చేసారు. అభ్యర్థి ఎవరనేది హైకమాండ్ నిర్ణయిస్తుంద ని తేల్చి చెప్పారు. ఎవరికి వారు తామే అభ్యర్థిగా ప్రకటించుకోవద్దని స్పష్టం చేసారు. బీఆర్ఎస్ కు ఈ ఉప ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. బీజేపీ తమ మిత్రపక్షాలతో ఈ ఎన్నిక పైన చర్చలు చేస్తోంది. ఇక, తాజాగా ఈ బై పోల్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయించగా.. అందులో ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

మారుతున్న లెక్కలు

బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ బై పోల్ అనివార్యంగా మారింది. ఈ సీటును తిరిగి దక్కించుకో వటం బీఆర్ఎస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. కాంగ్రెస్ సైతం ఈ సీటు పైన ఆశలు పెంచుకుంటోంది. గ్రేటర్ పరిధిలో 2023 ఎన్నికల్లో ఒక్క సీటు గెలవ లేక పోయిన కాంగ్రెస్ కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది. బీఆర్ఎస్ సిట్టింగ్ సీటు ను కైవసం చేసుకుంది. ఇప్పుడు అదే తరహాలో జూబ్లీహిల్స్ ను గెలుచుకోవాలని భావిస్తోంది. కాగా, ఇక్కడ సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎంఐఎం పాత్ర కీలకంగా మారుతోంది. ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా అనేది స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే అజాహరుద్దీన్ తానే పోటీ చేస్తానని ప్రకటించారు. కాగా.. రేవంత్ మాత్రం అభ్యర్థిని పార్టీ నిర్ణయిస్తుందని చెప్పారు.

బీఆర్ఎస్ కసరత్తు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం బీఆర్ఎస్ కసరత్తు మొదలు పెట్టింది. తమ పార్టీ నుంచి రెండు సార్లు విజయం సాధించిన గోపీనాథ్ కుటుంబానికి సీటు ఇవ్వాలని భావిస్తోంది. నియోజకవర్గం లో పబ్లిక్ పల్స్ పైన ఒక ప్రధాన పార్టీ సర్వే చేయిస్తున్నట్లు సమాచారం. గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలనేది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది. అయితే, గోపీనాథ్ కుటుంబ సభ్యులు ఈ అంశం పైన ఇంకా నిర్ణయానికి రాలేద ని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. సునీత బరిలోకి దిగటానికి అంగీరించకుంటే విష్ణు వర్ధన్ రెడ్డికి సీటు ఇస్తే ఫలితం ఎలా ఉంటుందని బీఆర్ఎస్ ఆలోచన చేస్తుంది. కాగా, సర్వేలో నియోజక వర్గ ప్రజల మూడ్ తెలుసుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మాగంటి కుటుంబ సభ్యులకే సీటు ఇస్తేనే బీఆర్ఎస్ కు కలిసి వచ్చే పరిస్థితి ఉన్నట్లు సర్వే సంస్థల సమాచారం. కాగా, ఎంఐఎం సహకారం ఏ రూపంలో కాంగ్రెస్ కు అందినా... అధికార పార్టీకి సీటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేల్చినట్లు తెలుస్తోంది.

గెలుపు ప్రతిష్ఠాత్మకం

ఇక్కడ గెలుపు సిట్టింగ్ సీటు కావటంతో బీఆర్ఎస్ ... అధికారంలో ఉండటంతో కాంగ్రెస్ కు ప్రతిష్ఠా త్మకంగా మారుతోంది. ఇదే సమయంలో బీజేపీ నుంచి ఒక పారిశ్రామిక వేత్త పేరు ప్రముఖంగా ఈ సీటు కోసం వినిపిస్తోంది.

# ఆంధ్రోళ్ల బిర్యానీ.. అక్క అగ్గి రాజేస్తోందా?

హైదరాబాద్,తెలంగాణలో బీఆర్ఎస్ కి జనాదరణ తగ్గుతుందన్నప్పుడల్లా సెంటిమెంట్ రాజేయడం ఆ పార్టీకి, ఆ పార్టీ నేతలకు అలవాటే. ఆ మాటకొస్తే తెలంగాణపై పేటెంట్ హక్కు తమదేనని హడావిడి చేస్తుంటారు గులాబీ నేతలు. మరి తెలంగాణ ఏర్పాటుకోసం కాంగ్రెస్ చేసిందేంటి..? కాంగ్రెస్ నాయకులు పదవుల్ని వదులుకోలేదా..? సీమాంధ్రలో పార్టీ చచ్చిపోతుందని తెలిసి కూడా కాంగ్రెస్ విభజన బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి ఆమోదింపజేయలేదా..? తెలంగాణ ఏర్పాటులో ఎవరి కృషి ఎంత ఉన్నా.. అంతా తమదేనని చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకు అలవాటే. అయితే ఇటీవల కాలంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. అభివృద్ధి కోరుకుంటున్నారు, అభివృద్ధికే జై కొడుతున్నారు. ఇక్కడే బీఆర్ఎస్ కి నష్టం వచ్చింది, కష్టం వచ్చిపడింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. అన్న ఒకదారి, చెల్లి మరోదారి, మీమాంసలో మిగతా బంధుగణం అన్నట్టుగా తయారయ్యాయి బీఆర్ఎస్ ఇంటర్నల్ పాలిటిక్స్. ఈ క్రమంలో తాజాగా జాగృతి జెండాలు, అజెండాలు, కండువాలతో బయటకొస్తున్న ఎమ్మెల్సీ కవిత మరోసారి సెంటిమెంట్ రాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీని తిడితే, ఏపీ నాయకుల్ని కామెంట్ చేస్తే, తెలంగాణలో తమ క్రేజ్ పెరుగుతుందనే భ్రమల్లో ఉన్నారు కవిత. అందుకే ఆంధ్రోళ్ల బిర్యానీ అంటూ సెటైర్లు పేల్చారు.

ఆంధ్రా చేపల పులుసు..

ఆంధ్రోళ్ల బిర్యానీ మనమేం తింటం? ఆంధ్రా బిర్యానీ ఎలా ఉంటదో కేసీఆర్ సార్ చెప్పిండు కదా.,. అంటూ ప్రెస్ మీట్లో వ్యాఖ్యానించారు కవిత. బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాక్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు భయపడి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బనకచర్లపై సైలెంట్ అయ్యారని ఆరోపించారు కవిత. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ తర్వాత బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని ఆమె చెప్పారు. అయితే కవిత వ్యాఖ్యలపై నెటిజన్లు ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేసిందేంటని నిలదీస్తున్నారు నెటిజన్లు. అప్పట్లో వైసీపీ నేత రోజా



ఇంటికి వెళ్లిన కేసీఆర్ ఏం మాట్లాడారో కవితగు గుర్తు లేదా అని కౌంటర్లిస్తున్నారు. ఆంధ్రా చేపల పులుసు అంత ఇష్టంగా తిన్న కేసీఆర్, ఆంధ్రోళ్ల బిర్యానీ గురించి కామెంట్ చేశారంటూ కవిత చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ఢిల్లీ లిక్కర్ సంగతేంటి..?

ఆంధ్రోళ్ల బిర్యానీ సంగతి సరే మరి ఢిల్లీ లిక్కర్ సంగతేంటని కవితను సోషల్ మీడియాలో నిలదీస్తున్నారు నెటిజన్లు. తెలంగాణ లిక్కర్ ఇష్టంలేకే ఢిల్లీ లిక్కర్ దందాలో మునిగితేలారా అంటూ ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలకు పదవులు లేకపోతే.. ఆంధ్రా బిర్యానీ, ఆనపకాయ, యాస, జాతి, భాష అర్జెంటుగా గుర్తుకు వచ్చేస్తాయంటూ ఒకరు కామెంట్ పెట్టారు. "గత 11 ఏళ్లలో మీరు మీ కుటుంబ సభ్యులు ఆంధ్రోళ్ళ ఇళ్ళలో, పెళ్లిళ్లలో, ఇతర శుభకార్యాలలో భోజనం చేసిన సందర్భాలు ఒక్క సారి గుర్తుతెచ్చుకోండి మేడం" అంటూ మరొకరు కామెంట్ పెట్టారు. ఇక బీఆర్ఎస్ పేరు మార్చాలంటూ మరో నెటిజన్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ పేరు భారత రాష్ట్ర సమితిగా ఉండటానికి వీల్లేదన్నారు. ఆంధ్ర ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కుతున్న ఆ పార్టీ నేతలు, ఆంధ్రా రహిత భారత రాష్ట్ర సమితి అనే పేరు పెట్టుకోవాలంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. మొత్తమ్మీద ఆంధ్రా బిర్యానీ అంటూ కవిత మరోసారి ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టాలని, ఆ మంటలో చలికాచుకోవాలని చూస్తూ నెటిజన్లకు బుక్కయ్యారు.

# డబుల్ ఇంజిన్ సర్కార్‌తో వేగంగా అభివృద్ధి

రాజమండ్రి, ప్రధానమంత్రి నరేంద్రమోదీ విజన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్లానింగ్‌తో ఏపీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఉద్ఘాటించారు. గత ఏడాది కాలంగా రూ. 450 కోట్లను వివిధ ప్రాజెక్టుల కింద ఖర్చు చేశామని వెల్లడించారు. టూరిజం శాఖ తరపున ఏడు ప్రాజెక్టులకు ఈ నిధులు వెచ్చించామని తెలిపారు. గురువారం రాజమండ్రిలో కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పర్యటించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి అఖండ గోదావరి, సైన్స్ సెంటర్, ఫారెస్ట్ అకాడమీకి శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు. అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో ఏపీ వేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. చంద్రబాబుని కలిసి పలు ప్రాజెక్టులపై కూడా చర్చించామని తెలిపారు. ఇరిగేషన్, టూరిజం అభివృద్ధికి కేందప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ప్రణాళికాబద్ధంగా ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పెహల్గాంలో పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని చెప్పారు. పర్యాటకులు స్వేచ్ఛగా అక్కడ ప్రాంతాలను సందర్శించవచ్చని తెలిపారు. మరో పదిహేను రోజుల్లో అక్కడ పర్యాటకుల సందడి మొదలవుతుందని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. ఎమర్జెన్సీపై కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కీలక వ్యాఖ్యలు చేశారు. '1975 జూన్ 25వ తేదీన భారతదేశంలో అత్యవసర పరిస్థితి విధించబడింది. ఇది ప్రజాస్వామ్యంపై అతిపెద్ద దాడి. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అన్ని ప్రాథమిక హక్కులను కాలరాశారు. పత్రికలపై ఆంక్షలు పెట్టి అరాచకాలు వెలుగులోకి రాకుండా అడ్డుకున్నారు. లక్షమందికిపైగా అన్యాయంగా అరెస్టులు చేశారు. ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చారు. సంజయ్ గాంధీ నియంతలా ప్రజల మీద పడి అరాచకాలకు పాల్పడ్డాడు. ప్రజల ఐక్యపోరాటంతో చివరకు ప్రజాస్వామ్యం విజయం సాధించింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా



ధైర్యంగా పోరాడిన కోట్లాది మంది త్యాగాలను ఈ సందర్భంగా దేశం గుర్తుచేసుకుంటుంది. నేటికీ కాంగ్రెస్ ఈ దుశ్చర్యను ఖండించకుండా, పశ్చాత్తాపం లేకుండా ఉండటం చాలా దురదృష్టకరం. జయప్రకాష్ నారాయణ్, వాజ్‌పాయ్, వంటి ఎంతోమంది నేతలు అప్పటి పోరాటాలకు నేతృత్వం వహించారు. ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి భారీ మూల్యం చెల్లించిన ఈ చారిత్రాత్మక పోరాటం చేసిన వీరులను దేశం కృతజ్ఞతతో నేడు గుర్తుచేసుకుంటుంది. దేశం వారికి సదాగౌరవం ఇస్తుంది. నేటి తరాలకు ఎమర్జెన్సీ రోజులను వివరిస్తాం అని గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. వికసిత్ భారత్ లో వికసిత్ ఆంధప్రదేశ్ ఒక భాగం అని బిజెపి ఎంపి పురంధేశ్వరి తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధి సాధ్యమని ఆనాడు చెప్పామని అన్నారు. ప్రజలు తమపై నమ్మకం ఉంచి ఆశీర్వదించి గెలిపించారని, అమరావతి, పోలవరం ఇలా అన్నింటిలో కేంద్రం సహకారం అందిస్తోందని, అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకుంటున్నామని తెలియజేశారు. చారిత్రక ప్రాధాన్యత గుర్తించి అభివృద్ధి చేసేందుకు కేంద్రం సాయమందిస్తోందని పురంధేశ్వరి పేర్కొన్నారు.

# బీజేపీ-వైసీపీ బంధం.. కూటమికి పారాహుషార్..!



న్యూఢిల్లీ,వైసీపీ అధినేత జగన్‌కు.. బిజెపి అధిష్టానం నుంచి ఫోన్ వచ్చిందా? అంటే బిజెపి నాయకులు స్వయంగా ఆయనకు ఫోన్ చేశారా? అంటే.. ఇలా ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తుంది. దీనికి ప్రధాన కారణం బిజెపి నుంచి కీలక నాయకుడు ఒకాయన ఫోన్ చేసినట్టు ప్రచారం లోకి రావటమే. దీనికి సంబంధించి ఒక కీలక విశ్లేషకుడు కూడా ఒక వ్యాఖ్య చేశారు. జగన్ పై రెంటపాళ్ల ఘటనకు సంబంధించి కేసు నమోదు చేయడం పట్ల బిజెపిలో కొంత వ్యతిరేకత అయితే వచ్చిందనేది ఆయన చెప్పిన మాట. ఈ క్రమంలోనే కేంద్రంలో బిజెపి వ్యవహారాలు చూసే ఒక ఉత్తరాది నాయకుడు జగన్ కు ఫోన్ చేశారని చెప్పుకొచ్చారు. అంతేకాదు జగన్ పై కేసు నమోదు చేయడాన్ని కూడా ఖండించారు అనేది విశ్లేషకుడు చేసినటువంటి వ్యాఖ్య. ఈ క్రమంలో అసలు ఏం జరిగిందనేది తెలియకపోయినా బీజేపీ నాయకులు మాత్రం జగన్‌తో టచ్ లో ఉన్నారనేది స్పష్టమైనది. వాస్తవానికి 2024 ఎన్నికల్లో బిజెపితో జగన్ కలివిడిగా ఉంటారని ఆయనతో కలిసి పోటీ చేయాలని బిజెపి నాయకులు భావించినట్టు తెరమీదకు వచ్చింది. ఈ విషయాన్ని వైసిపి నాయకులు ఒకరిద్దరు కూడా చెప్పుకొచ్చారు. కానీ ఆ తర్వాత పరిణామాలను గమనిస్తే బిజెపి - టిడిపి-జనసేన తో కలిసి ఎన్నికలకు వెళ్ళింది. విజయం దక్కించుకొని కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇన్నాళ్ల తర్వాత అంటే దాదాపు ఒక సంవత్సరం తర్వాత పైగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్ లో కలివిడిగా ఉన్న సమయంలో అనూహ్యంగా జగన్ కు ఫోన్ రావడం ఆయనను పరామర్శించడం లేదా చర్చించడం వంటివి బిజెపి కేంద్ర నాయకత్వం నుంచే జరగడం నిజమైతే రాష్ట్రంలో కూటమి వ్యవహారం ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఎందుకంటే వ్యక్తిగతంగా నాయకులను అభిమానించటం లేదా నాయకులను పరామర్శించడం తప్పుకాదు. కానీ బిజెపి ఆఫీసులో కూర్చుని, బిజెపి జండా పట్టుకుని ఇలా తమ ప్రత్యర్థి పట్ల సానుకూలంగా స్పందించడం అంటే పైగా జాతీయస్థాయిలో జరిగిన వ్యవహారం కావడంతో ఇది కచ్చితంగా ఆలోచించాల్సిన విషయం. పైగా బిజెపి తన అవసరానికి తగిన విధంగా మారుతుంది అన్న చరిత్ర ఉన్న నేపథ్యంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని కూటమిని పలువురు హెచ్చరిస్తున్నారు.

# చర్చలంటూనే.. లీగల్ ఫైటా..



సెంట్రల్ డెస్క్:ఏపీ-తెలంగాణ రాష్ట్రాల మధ్య చోటు చేసుకున్న జల వివాదంలో కీలక మలుపు చోటు చేసుకుంది. దీనిపై న్యాయపరమైన పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి ఎలా వెళ్లాలి? ఏం చేయాలనే దానిపై న్యాయవాదుల నుంచి, అదేవిధంగా అడ్వొకేట్ జనరల్ నుంచి అభిప్రాయాలు తీసుకుని ఒక ఫైల్ రెడీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. దీనికి రెండు రోజులే గడువు విధించారు. తర్వాత.. ఈ వ్యవహారాన్ని న్యాయపరంగానే తేల్చుకుందామని వ్యాఖ్యానించారు. దీంతో ఏపీ-తెలంగాణల మధ్య నెలకొన్న జల వివాదం కీలక మలుపు తిరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు.. ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని ఆశ్రయించి.. జల వివాదాలను చర్చించుకుని పరిష్కరించే మార్గాలపై దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు సీఎం చంద్రబాబు మంత్రివర్గానికి సూచించారు. దీనికి అందరూ ఓకే చెప్పారు. అంతేకాదు.. కేంద్రం వద్దకు వెళ్లేందుకు.. మంత్రులతో కూడిన కమిటీని కూడా వేయాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కసరత్తు కూడా మొదలైంది.

ఏంటీవివాదం.. ?

కర్నూలు జిల్లాలోని బనకచర్ల గ్రామంలో బనకచర్ల పేరుతో భారీ ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. గోదావరి నది నుంచి సముద్రంలో కలిసే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా వెనక్కి మళ్లించి బనకచర్లలో నిల్వ చేస్తారు. ఈ నీటిని.. రాయల సీమలోని సాగు, తాగునీటికి వినియోగిస్తారు. సముద్రంలోకి ప్రస్తుతం 3 వేల టీఎంసీల నీరు వృథాగా పోతోంది. దీనిలో 200 టీఎంసీల నీటిని బనకచర్ల ద్వారా వాడుకోవాలని సర్కారు నిర్ణయించింది. అయితే.. దీనికి తెలంగాణ ప్రభుత్వం సహా.. అక్కడి విపక్షాలు అడ్డు చెబుతున్నాయి. ఇలా చేస్తే.. గోదావరిలో వరద జలాలు లేనప్పుడు కూడా.. తమ నీటిని ఏపీ వాడేస్తుందని ఆరోపిస్తున్నారు. అంతేకాదు.. గోదావరిపై ఇప్పటికే కట్టిన పోలవరం ద్వారా నష్టం వస్తోందని.. దీనిని ఆపేయాలని బీఆర్ ఎస్ నాయకురాలు కవిత గతంలో సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌ను తెరమీదికి తెస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి కూడా పలుమార్లు కేంద్రం వద్దకు వెళ్లి బనకచర్లకు వ్యతిరేకంగా నివేదికలు ఇచ్చారు. ఈ విషయం తెలిసిన ఏపీ సీఎం చంద్రబాబు రగడ వద్దు.. చర్చించుకు ని పరిష్కరించుకుందామని అంటున్నారు. దీనికి దాదాపు తెలంగాణ సీఎం కూడా ఓకే చెప్పారు. కానీ.. ఇంతలోనే స్థానిక ఎన్నికలకు ముహూర్తం రెడీ అవుతుండడంతో ప్రభుత్వం వెంటనే యూటర్న్ తీసుకుని.. బనకచర్లపై న్యాయ పోరాటమే కరెక్ట్ అన్నట్టుగా నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ.. పవన్ ఫస్ట్ రియాక్షన్!

అమరావతి,గత మూడేళ్లుగా తీవ్ర వివాదంగా ఉన్న విశాఖ పట్నం ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశంపై రాజకీయ నాయకులు నేరుగా ఇప్పటి వరకు మాట్లాడింది లేదు. గతంలో వైసీపీ హయాంలో దీనిని ప్రైవేటీకరణ చేస్తున్నామంటూ.. కేంద్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. కీలకమైన ముడి ఇనుము గనులను కేటాయిం చకుండా.. ఉద్యోగులను తొలగిస్తూ.. దాదాపు ఫ్యాక్టరీ మూసివేత దిశగా అప్పట్లోనే అడుగులు పడ్డాయి. దీంతో అప్పటి సీఎం జగన్ ప్రధాని మోడీకి నాలుగు పేజీల లేఖ రాసి ఊరుకున్నారు. ఇక, కూటమి సర్కారు వచ్చాక కూడా.. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ అంశానికి ఎలాంటి పరిష్కారం చూపలేకపోయారన్న ఆవేదన, ఆందోళన కొనసాగుతోంది. ఈ క్రమంలో కొన్నాళ్ల కిందట.. కాంగ్రెస్ పార్టీ చీఫ్ షర్మిల విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ దగ్గర నిరసన దీక్ష చేపట్టారు. ఇదిలావుంటే.. కేంద్రం 11400 కోట్ల రూపాయలను ఆ మధ్య కేటాయించింది. దీంతో ఇక, ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాబోదని అనుకున్నారు. కానీ.. దీనిపై కేంద్రం కూడా ఇతమిత్థంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఈ క్రమంలో ఈ నెల 21నప్రధాని విశాఖ పర్యటనకు వచ్చారు. యోగాంధ్రలో పాల్గొని ఆసనాలు వేశారు. అప్పుడైనా ఆయన విశాఖ ఉక్కుపై క్లారిటీ ఇస్తారని అందరూ అనుకున్నారు. కానీ.. అప్పుడు కూడా మోడీ స్పందించలేదు. ఇలా.. ఒక సస్పెన్స్ వాతావరణం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో తాజాగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీనిపై ఫస్ట్ టైమ్ రియాక్ట్



అయ్యారు. రాజమండ్రిలో నిర్వహించిన అఖండ గోదావరి ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు."విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం కాకుండా.. కాపాడాం." అని పవన్ కల్యాణ్ చెప్పారు. ఇలా విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ కీలక పాత్ర పోషించారని అన్నారు. వీరులు పుట్టిన గడ్డ రాజస్థాన్ నుంచి వచ్చిన షెకావత్.. పౌరుషాల గడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రజల పరిస్థితిని అర్థం చేసు కున్నారని చెప్పారు. అందుకే విశాఖ ఉక్కు సగర్వంగా నిలబడిందన్నారు. దీంతో .. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశంపై క్లారిటీ వచ్చిందని రాజకీయ వర్గాలు, ఉద్యోగులు కూడా భావిస్తున్నారు.

# ఇంటింటికీ వైసీపీ.. జగన్‌కు మేలు చేస్తుందా ..!

అమరావతి,ఇంటింటికి వైసీపీ పేరుతో వైసిపి అధినేత జగన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఒక లక్ష నిర్దేశం చేశారు. రాజకీయాల్లో ప్రజలను కలుసుకోవడం, ప్రజా సమస్యల ప్రస్తావించడం, వారి సమస్యలపై పోరాటం చేయటం అనేది ప్రతిపక్షంగా నాయకులు చేయాల్సిన కర్తవ్యం. వాస్తవానికి చెప్పాలంటే 2019లో టిడిపి అధినేత చంద్రబాబు కేవలం 6 మాసాల గడువు లోపే ప్రజల మధ్యకు వచ్చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఆయన తూర్పారబట్టారు. ఆయనతో పోల్చి చూసుకుంటే జగన్ చాలా లేట్ చేశారని చెప్పాలి. ఇప్పటికే పలుమార్లు ప్రజల మధ్యకు వస్తానని చెప్పి ఆయన రాకపోవడం, నాయకులను, కార్యకర్తలను పంపించే ప్రయత్నం చేసిన అది కూడా సక్సెస్ కాకపోవడం వంటివి పార్టీలోను బయట రాజకీయ వర్గాల్లోనూ చర్చ గా మారింది. ఈ క్రమంలో తాజాగా చంద్రబాబు మేనిఫెస్టోను రీకాల్ చేస్తూ ప్రజల మధ్యకు వెళ్లాలని జగన్ పెట్టుకున్న లక్ష్యంగా కనిపించింది. తద్వారా 2024 ముందు ఇచ్చినటువంటి హామీలు, చేస్తామన్న పనులు, ఎన్నికల తాయిలాలు వంటివి తిరిగి ప్రజలకు గుర్తు చేయాలనేది జగన్మోహన్ పెట్టుకున్న లక్ష్యం. అయితే ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుంది, ఎంతవరకు విఫలం అవుతుంది అనేది పక్కన పెడితే కీలకమైన వైసిపి ఓటు బ్యాంకుకు మాత్రం ఇది ఎంతో కొంత మేలు చేస్తుంది అనేది పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎలా అంటే.. గత ఎన్నికల్లో జగన్ కన్నా ఎక్కువగా తమకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో వైసిపికి అనుకూలంగా ఉన్న కొన్ని కుటుంబాలు టిడిపికి ఓటు వేసి ఉంటే లేదా కూటమికి ఓటు వేసి ఉంటే ఇప్పుడు ఆయా వర్గాలు తిరిగి వైసిపికి అనుకూలంగా మారేందుకు ఈ ఇంటింటికి కార్యక్రమం కచ్చితంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు .తద్వారా ఇది భవిష్యత్తులో వైసీపీకి మేలు చేస్తుంది అనేది పరిశీలకు ల అంచనా. ఇది పూర్తి స్థాయిలో మేలు చేస్తుందా.. పరోక్షంగా మేలు చేస్తుందా అనేది



పక్కన పెడితే మొత్తానికి ప్రజల్లోకి అయితే వైసీపీకి ఒక ఇమేజ్ పెరుగుతుందనేది, అదే విధంగా కూటమి సర్కారుకు కూడా మరోవైపు ఒత్తిడి పెరిగి పథకాలను అమలు చేయడమా లేకపోతే ఎదురు దాడి చేయడం అనేది తేల్చుకునే పరిస్థితి వస్తుందని అంచనా కూడా వినిపిస్తోంది. ఎలా చూసుకున్నా జగన్ చాలా వ్యూహాత్మకంగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు. సహజంగా ఇదే కార్యక్రమాన్ని ఒక ఆరు నెలల ముందే ప్రారంభించి ఉంటే ఆ ప్రభావం పెద్దగా ఉండేది కాదు. కానీ ఏడాది తర్వాత ఇచ్చిన హామీలపై నిలదీయాలని లేదా ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునివ్వడం ద్వారా వైసిపి వ్యూహం పనిచేయనుంది. ఇది ఒక రకంగా పార్టీకి ఉపయోగపడుతుంది. ఇక ప్రభుత్వం పరంగా ఎదురయ్యే సమస్యలు ప్రభుత్వం ఎలా డిఫెన్స్ చేసుకుంటుంది అనేది ఆ పార్టీ వేరుగా ఉంటుంది. కాబట్టి ప్రతిపక్ష కోణంలో చూసినప్పుడు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం లో ఎలాంటి తప్పుగాని అతిశయోక్తిగాని ఏమాత్రం లేదని చెప్పాలి.

# పహల్గాం ప్రస్తావన లేకుండానే ఎస్సీవో పత్రం..



న్యూఢిల్లీ, చైనాలోని కింగ్‌డావోలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత ఆయన చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఇటీవలే పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ మాట్లాడారు. దీనికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా వివరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం భారత్ హక్కు అంటూ కుండ బద్దలు కొట్టారు. అయితే, సమావేశం అనంతరం దీనిపై జాయింట్ డాక్యుమెంట్ ను సిద్ధం చేశారు.

అయితే, అందులో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో దానిపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేశారు. ఈ సమావేశంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. 'కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధాన పరికరంగా మలుచుకున్నాయి. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నాయి. అలాంటి ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదు. అటువంటి దేశాల చర్యలను ఏ మాత్రం ఊపేక్షించకూడదు. అలాంటి వాటిని ఎస్సీఓ ఖండించాలి. శాంతి, ఉగ్రవాదం ఎప్పటికీ కలిసి ఉండలేవు. విధ్వంసాలకు కారణమయ్యే ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లో ఉండకూడదు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నిర్ణయాత్మకమైన చర్య అవసరం. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా ఐక్యం కావాలి' అంటూ ఆయా సభ్య దేశాలకు రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

# సత్వరంగా ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం..జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్ ను ఏర్పాటు చేసింది. విజయవాడ కేంద్రంగా జలహారతి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇది పోలవరం- బనకచర్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్పొరేషన్. అలాగే ఇతర ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేందుకూ పని చేస్తుంది. విజయవాడలో జలవనరుల శాఖ కార్యాలయంలో 'జలహారతి' కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటైంది. బనకచర్లతోపాటు ఇతర ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసేలా ఈ సంస్థకు బాధ్యతలు అప్పగించింది ఏపీ ప్రభుత్వం. కాగా, తెలుగు రాష్ట్రాల్లో పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు వివాదంగా మారిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు చంద్రబాబు సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. తెలంగాణ ప్రభుత్వం మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తెలంగాణ నీళ్లను ఏపీ దోచుకుపోవాలని చూస్తోందంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో బనకచర్ల ప్రాజెక్టు కోసం తాజాగా జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్ ని ఏపీ సర్కార్ ఏర్పాటు చేసింది. సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలను రాయలసీమ, పల్నాడు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించడమే ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. అయితే దీనిపై తెలంగాణ సర్కార్ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**